క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించాలి



సుభాష్‌నగర్: నగరంలోని దుబ్బలోగల గుడిసె వాసులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, తదితర మౌలిక వసతులు కల్పించాలని ఇండ్లు, ఇండ్లస్థలాల సాధన కమిటీ కన్వీనర్ మల్యాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన గుడిసెవాసులతో కలిసి, ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. దుబ్బలోని సర్వేనెంబర్ 171, 172లోగల ప్రభుత్వ భూమిలో 300 కుటుంబాలు నివాసముంటున్నాయని తెలిపారు. ఆ భూమి తమదేనంటూ పంచాయతీరాజ్ టీచర్లు వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కావున ఆ భూమిని సర్వే చేయించి, గుడిసెలు వేసుకుని నివాసముంటున్న ప్రజలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల వేధింపులు ఆపాలని, ఇళ్ల స్థలాల పోరాట ప్రజలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేయాలని డిమాండ్‌చేశారు. నాయకులు, నిరుపేదలు గంగాధర్, శ్రీధర్, మునావర్, రహమత్, మీర, నిర్మలాబాయి, లక్ష్మీ, లక్ష్మణ్, సునీత ఉన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



డిచ్‌పల్లి: మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో సోమవారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు 'దేశవ్యాప్త కార్మికుల సమ్మె–గ్రామీణ భారత్ బంద్' పోస్టర్లను ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న 'దేశవ్యాప్త కార్మికుల సమ్మె– గ్రామీణ భారత్‌బంద్' చేపట్టినట్లు తెలిపారు. కార్మికులందరూ సమ్మెలో పాల్గొని, విజయవంతం చేయాలన్నారు. యూనియన్ ప్రతినిధులు సుప్రియ, ప్రమీల, సావిత్రి, అరుణ, రాంబాయి, వీరలక్ష్మీ, రమ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి



ఖలీల్‌వాడి: టీడీపీలోని ప్రతి ఒక్కరూ క్రమశిక్షణగా మెలగాలని, పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని పార్టీ అర్బన్ ఇన్‌చార్జి వినోద్ కుమార్ పేర్కొన్నారు. నగరంలో సోమవారం పార్టీ పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా చెరుకు గంగాధర్, జనరల్ సెక్రెటరీగా అశోక్, రాములు ఎన్నికయ్యారు. అనంతరం వినోద్ మాట్లాడుతూ.. అనుబంధ సంఘాల కమిటీలు వేస్తామని తెలిపారు. నాయకులు అహ్మద్, బోబ్బ నరసింహ రావు, గంగాధర్, అశోక్, రాములు, నరేందర్, రమణ, వెంకట రమణ, రమేష్ గౌడ్, చెన్నమ్మ, విష్ణు, సాయిలు, కలీం, శ్యామ్ పాల్గొన్నారు.

పశువైద్యులను అందుబాటులో ఉంచాలి

సుభాష్‌నగర్: ఆర్మూర్ మండల పరిధిలోని పశువుల ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, వెంటనే స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, జిల్లా కార్యదర్శి దేవరాం డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో పాడి రైతులతో కలిసి వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆర్మూర్ ఏడీ పరిధిలోని 9 ఆస్పత్రుల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. ఏడీ స్థానికంగా అందుబాటులో ఉండకపోవడంతో పర్యవేక్షణ గాలికొదిలేశారని, తద్వారా పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమస్యపై ఏడీకి ఫిర్యాదు చేస్తే ఎలాంటి స్పందన లేదన్నారు. పాడి రైతులు గోర్త గంగాధర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి విద్యార్థులకు వివిధ పోటీలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈనెల 7నుంచి జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిర భవిష్యత్ కోసం సైన్స్ అనే అంశంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 7న ప్రతి పాఠశాలలో పోటీలు నిర్వహించి, ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి, నలుగురిని మండల స్థాయికి పంపించాలన్నారు. 9న మండల స్థాయిలో పోయెట్రీ, పెయింటింగ్ పోటీలు నిర్వహించి, విజేతలను ఈ నెల 12న జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు పంపించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 28న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

యథేచ్ఛగా జల చౌర్యం

- నిజామాబాద్ నగరంలో సుమారు 60వేల కుళాయి కనెక్షన్లు!
- ఆన్‌లైన్‌లో నమోదైనవి 25వేలే..
- జాడలేని 35వేలకు పైగా కనెక్షన్లు





నిజామాబాద్‌నాగారం: నగర మున్సిపల్ కార్పొరేషన్‌కు పైసా నీటి పన్ను చెల్లించకుండా భారీగా జల దోపిడి చేస్తున్నారు. పలు డివిజన్లలో అక్రమ కుళాయి కనెక్షన్లు ఏర్పాటుచేసుకొని మున్సిపాలిటి నీటిని యథేచ్ఛగా తోడేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో మున్సిపల్ భారీగా ఆదాయం కోల్పోతుంది.

ఇదీ పరిస్థితి..

నగరంలోని 60 డివిజన్‌ల పరిధిలో 84వేల ఇళ్లకు ఆస్తి పన్ను విధిస్తున్నారు. ఈ లెక్కన నీటి కుళాయిల కనెక్షన్లు సుమారు 60వేల వరకు ఉన్నాయి. కానీ ఆన్‌లైన్‌లో మాత్రం కేవలం 25వేల కనెక్షన్లు ఉండగా, ఇంకా 35వేల కనెక్షన్‌ల జాడలేదు. ఆన్‌లైన్‌లోని 25వేల కనెక్షన్లకు ప్రతినెలా రూ.100 చొప్పున పన్నును మున్సిపల్ అధికారులు వసూలు చేస్తున్నారు. కానీ అక్రమంగా ఉన్న 35వేల కుళాయి కనెక్షన్ల వల్ల నగర కార్పొరేషన్‌కు ప్రతి నెల రూ.35లక్షలు, అంటే ఏడాదికి రూ. 4.5కోట్ల నష్టం వస్తుంది.

నగర కార్పొరేషన్‌కు రూ.కోట్లలో నష్టం

అక్రమ నీటి కుళాయిల కనెక్షన్లు లెక్కలోకి రాకుండా శాఖలో పనిచేసే కొంత మంది అధికారులు, కిందిస్థాయి సిబ్బంది వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. గత కొన్నేళ్లుగా అక్రమ కుళాయి కనెక్షన్ల కారణంగా రూ.కోట్లలో మున్సిపాలిటీకి నష్టం జరుగుతుంది. ఆయా జోన్‌ల పరిధిలో అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి, అక్రమ నీటి కుళాయిలను గుర్తిస్తే శాఖకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అలాగే మున్సిపల్ కమిషనర్ దృష్టిపెట్టి, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని, అక్రమ కనెక్షన్లను సక్రమంగా మారిస్తే మున్సిపల్‌కు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

పట్టించుకోని అధికారులు..

నగరంలోని దాదాపు ప్రతి ఇంటికి ఇంజనీరింగ్‌కు సంబంధించిన అధికారులు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చారు. సక్రమంగా ఉన్నా వాటికి ప్రతి నెలా బిల్లులు వసూలు చేస్తూనే ఉన్నారు. కానీ అక్రమంగా ఉన్న నీటి కుళాయిలను పట్టించుకోవడం లేదు. దీంతో దర్జాగా జల దోపిడి జరుగుతుంది. నగరంలో ఉన్న ఐదు జోన్ కార్యాలయాల్లో కనీస పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఆయా జోన్‌ల పరిధిలోని కిందిస్థాయి సిబ్బంది అక్రమ కనెక్షన్‌లకు సహకరిస్తు 'మామూలు'గా తీసుకుంటున్నారని శాఖలో చర్చించుకుంటున్నారు.

• ఇసుక కోసం అనుమతులు తీసుకోవాలి

సిరికొండ: మండలంలో ఎవరికైన ఇసుక, మొరం అవసరం ఉన్నవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తహసీల్దార్ రవీందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక అవసరం ఉన్న వారు 'The District Collector, Nizamabad' పేరున ఒక ట్రాక్టరు ట్రిప్పునకు రూ.900 బ్యాంకులో డీడీ తీసీ ఇసుక మంజూరుకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని ఆయన సూచించారు. బుధ, శుక్రవారాలలో ప్రభుత్వ అనుమతి ఉన్న పాయింట్ల నుంచి ఇసుక సరఫరా చేస్తామని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక, మొరం అక్రమ రవాణా చేసినట్లయితే వారిపై చట్ట రీత్యా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

• కొటేషన్లకు ఆహ్వానం

నిజామాబాద్ సిటీ: ఈ నెలా 16న నీలకంఠేశ్వర స్వామి రథసప్తమి, వచ్చేనెలా మార్చి 8న శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో తగు ఏర్పాట్ల కోసం సీల్డ్ కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఆలయం ఈవో జి వేణు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఉత్సవాల సందర్భంగా ఆలయం శిఖర మునకు, శాలాహాలము చుట్టురా హెలోజన్ లైట్లు, దేవతా ప్రతిమల లైటింగ్ బోర్డ్స్, మైక్‌సెట్‌ల ఏర్పాటు, అలాగే రథసప్తమి, శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ తడికలు, బారీకేడ్లు ఏర్పాటు చేయుటకు తడికల దుకాణం వారి నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కొటేషన్ల కవర్లు ఈ నెలా 7న ఉదయం 10 గంటలలోపు ఆలయ కార్యాలయంలో ఇవ్వాలని, ఈ సీల్డ్ కవర్లు అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు విప్పి అర్హత గల వారిపేర్లు ప్రకటించటం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు సెక్యూరిటి డిపాజిట్ కింద రూ. 5వేలు కార్యనిర్వాహణాధికారి పేరున చెక్కు లేదా, డీడీ సమర్పించాలన్నారు. విద్యుత్ అలంకరణ విషయమై పనులు దక్కించుకున్న వారు ఆలయం అధికారులకు హామీపత్రము సమర్పించవలసి ఉంటుందన్నారు.

సమాచారం..

• 19నుంచి 'గీతా భవన రజతోత్సవాలు'

నిజామాబాద్ సిటీ: నగరంలోని శివాజీనగర్ శ్రీకృష్ణ గీతా భవన రజతోత్సవాలు ఈనెల 19నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ ఆశ్రమం కామారెడ్డి శ్రీ రామకోటి జప లిఖిత ప్రచారకుడు, తెలంగాణ సాధుపరిషత్ ప్రచార కార్యదర్శి కృష్ణనంద స్వామీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆలయంలో నిర్వహించనున్న ఉపన్యాసంలో భక్తులు పాల్గొనాలని స్వామీజీ కోరారు.

• యువనాటిక రచనల పోటీలు

నిజామాబాద్ సిటీ: కళాశాల విద్యార్థులతో పాటు ఇతర రంగాలలో ఉన్న యువతకు యువనాటిక రచనల పోటీలను నిర్వహించనున్నట్లు సంస్కృతి వ్యవస్థాపకుడు నర్రాజు బాలచందర్(గుంటూర్) ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రంగస్థలంపై యువత ప్రవేశం వర్తమాన స్థితిలో అత్యంత అవశ్యకమైన అంశమన్నారు. కొత్త తరాన్ని నాటకం వైపు మళ్లించి, తెలుగు నాటక రంగాన్ని పరిపుష్టం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రచనాసక్తి ఉన్న విద్యార్థి రచయితలను రచనలు చేయాలని సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రచనలో నిబంధనలు ప్రదర్శనా కాలపరిధి 25 నుంచి 30 నిమిషాలు మించకుండా ఉండాలి. సమాజంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యారంగ అస్తవ్యస్త విధానాలతో పాటు సమాజ చైతన్యానికి యువత పాత్ర వంటి ఇతివృత్త నేపథ్యంలో రచనలు ఉండాలన్నారు. రచయితలు మూడు ప్రతులను, దరఖాస్తులు ఈ నెలా 29లోపు పంపాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ. 10వేలు, ద్వితీయ రూ. 7500, తృతీయ రూ. 5వేలు, ప్రత్యేక బహుమతి రూ. 2500లు మార్చి 30న ప్రకటిస్తామన్నారు. దరఖాస్తులను డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, ఇంటినం.3–391 పండరీపురం, 9వ లైన్, చిలకలూరిపేట (522616)కు పంపించాలన్నారు. వివరాలకు 9848351517ను సంప్రదించాలన్నారు.

• నేడు జక్రాన్‌పల్లి మండల సమావేశం

జక్రాన్‌పల్లి: మండలకేంద్రంలో మంగళవారం జక్రాన్‌పల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బ్రహ్మానందం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపీపీ కుంచాల విమల అధ్యక్షతన ఉదయం పదిన్నర గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సంక్షిప్తం

విద్యార్థులకు అభినందన



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సుద్దపల్లి గురుకుల బాలికల పాఠశాల/కళాశాల విద్యార్థినులు ఆదివారం మెదక్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ బాలికల పోటీల్లో విజేతగా నిలిచారని ప్రిన్సిపాల్ గోదావరి తెలిపారు. ఈసందర్భంగా సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు రాణి, వైశాలి, ప్రణీత, సాత్విక, సావిక, నేహశ్రీ, బిందు, నేహా, గంగోత్రిలను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ దీప్తివాణి, వనిత, నల్లూరి లత, జెన్నెపల్లి మానిక, కోచ్ మానిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీపీ పాలకవర్గానికి సన్మానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మంచిప్ప గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో సోమవారం వారిని వీడీసీ, పంచాయతీ సిబ్బంది, జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు సన్మానించారు. మాజీ సర్పంచ్ ఇందూరి సిద్ధార్థ, మాజీ ఉప సర్పంచ్ జగదీష్, మాజీ వార్డు సభ్యులు సాయిరెడ్డి, మైసన్న, ప్రవీణ్, లత, ఊర్మిల, శాలీబాయ్, పుష్ప, వీడీసీ ప్రతినిధులు గోవూరు నరేష్, దేవిసింగ్, మండల కో ఆప్షన్ అజీమ్, నాయకులు సాయిరాం, వెంకట్రాం, కేల్‌సింగ్, సాయిలు పాల్గొన్నారు.

ధర్పల్లి సీఐకి..



సిరికొండ: ధర్పల్లి సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన భిక్షపతిని సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాకారం రవి, డీసీసీ కార్యదర్శి రావుట్ల ఎర్రన్న తదితరులు ఉన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని జాతీయ బంజారా మిషన్ ఇండియా జిల్లా ప్రధానకార్యదర్శి కెతావత్ సురేష్ నాయక్ ఒక ప్రకటనలో కోరారు. దేశంలో అన్ని కుల, మత గురువులు, పండుగలకు ప్రభుత్వాలు సెలవులు ప్రకటించాయని, గిరిజనులకు పండుగ రోజైన సేవాలాల్ జయంతి రోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవుదినంగా ప్రకటించాలన్నారు.

ఖిల్లా జైలును సందర్శించిన విద్యార్థులు



నిజామాబాద్ రూరల్/నిజామాబాద్ సిటీ: రూరల్ మండలంలోని గూపన్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు సోమవారం జిల్లా కేంద్రంలోని ఖిల్లా పాత జైలును సందర్శించారు. ఈసందర్భగా ఖిల్లా జైలు ప్రాముఖ్యతను పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఘనపురం దేవేందర్ విద్యార్థులకు వివరించారు. చరిత్రకారుడు కంకణాల రాజేశ్వర్, ఖిల్లా కమిటీ సభ్యుడు శంకర్ విద్యార్థులకు అనేక విషయాలు తెలిపారు. ఉపాధ్యాయులు మంజులత, శ్రీరామ లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహానికి అంత్యక్రియలు



నిజామాబాద్‌నాగారం: గౌతంనగర్‌కు చెందిన పవన్ అనే యువకుడు ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి అంత్యక్రియలు చేసే ఆర్థిక స్థోమత లేకపోవడంతో 3వ ఠాణా ఎస్సై ప్రవీణ్ ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థను సంప్రదించారు. దీంతో సోమవారం దుబ్బ రోడ్డులోని సార్వజనిక్ స్మశాన వాటికలో సంస్థ ప్రతినిధులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, సభ్యులు కాసుల సాయితేజ, మద్ది గంగాధర్ పాల్గొన్నారు.

శివాలయాల్లో పూజలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. నీలకంఠేశ్వరస్వామి ఆలయం, శంభులింగేశ్వర ఆలయం, ఉమా మహేశ్వర ఆలయం, ఓంకార మందిరం తదితర శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా కొన్ని ఆలయాల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కళాకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కళాకారులు కీలక పాత్ర పోషించారని, కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అన్ని విధాల అండగా ఉంటుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ అన్నారు. మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక కళా సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ కళలు, సాహితీ సంస్కృతి కవులు, కళాకారుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు కోలాటం, జడకొప్పులు, ఆట, పాట, మాట, ధూంధాం నృత్యాలతో అలరించారు. మోపాల్ మండలానికి చెందిన వేదసాయి ప్రదర్శించిన నాట్యం ఆహుతులను ఎంతగానో అలరించింది. అనంతరం పలువురు కళాకారులను అభినందించి అవార్డులను అందజేశారు. తెలంగాణ సాంస్కృతిక కళామండలి రాష్ట్ర అధ్యక్షురాలు పాట రాజశ్రీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దెగావత్ గణేష్, ఆంజనేయులు, కోశాధికారి ఎర్ర గంగనర్సయ్య, డప్పు సంతోష్, కొండ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



ఖలీల్‌వాడి: కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ నేతలు అన్నారు. ఈమేరకు సోమవారం వారు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయనకు తగిన గుణపాఠం తప్పదన్నారు. పార్టీ నాయకులు చక్రి దత్తాద్రి, రామ్ భూపాల్, బైండ్ల ప్రశాంత్, అశ్రప్, యునూస్, ఎడ్డిగారి నిఖిల్, షబ్బీర్ పాల్గొన్నారు.

వేద స్కూల్‌లో వైద్యశిబిరం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని శ్రీవేద హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ ఆధ్వర్యంలో సోమవారం కంటి, దంత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రి, లైఫ్ కేర్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

మెస్‌బిల్లుల పేరిట అదనపు భారం మోపవద్దు

- విద్యార్థి సంఘాల డిమాండ్
- తెయూలో తరగతుల బహిష్కరణ



తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి మెస్ బిల్లుల రిజిస్టర్‌ను చూపిస్తున్న విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): హాస్టల్ మెస్ బిల్లుల పేరిట విద్యార్థులపై అదనపు భారం మోపవద్దని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం విద్యార్థులు తరగతులు బహిష్కరించి, తెయూ రిజిస్ట్రార్ యాదగిరి ఛాంబర్‌ను ముట్టడించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచకుండా విద్యార్థులపై అధిక భారం మోపుతూ హాస్టల్స్ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. మెస్ కమిటీ నమోదు చేసిన బిల్లులకు సంబంధం లేకుండా లెడ్జర్‌లో అధిక డబ్బులు నమోదు చేస్తున్నారని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. అవినీతి జరిగిన మెస్ బిల్లులను తక్షణమే మాఫీ చేసి విద్యార్థులపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ యాదగిరి స్పందించి మెస్ బిల్లుల అవకతవకలపై ఒక కమిటీని వేస్తున్నట్లు ప్రకటించారు. విచారణ జరిపి అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించి, వెనుదిరిగారు. విద్యార్థి సంఘాల ప్రతినిధులు సాయిపవన్, కొమిర శ్రీశైలం, రాచకొండ విఘ్నేష్, అల్లూర్ రాజేందర్, నిరంజన్, బానోత్ సాగర్ నాయక్, విజయకుమార్, శివకుమార్, రమ్య, పావని, గీత, హరిత, పవిత్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- డీపీవో జయసుధ
- జీపీ స్పెషల్ ఆఫీసర్లకు అవగాహన

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ డివిజన్‌లోని అన్ని గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని డీపీవో జయసుధ అధికారులకు సూచించారు. డిచ్‌పల్లిలోని మానవతసదన్‌లో సోమవారం నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లకు విధిని ర్వహణలో భాగంగా పాటించాల్సిన విధివిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీపీవో జయసుధ, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఎల్‌పీవో నాగరాజు పాల్గొని, స్పెషల్ ఆఫీసర్లకు వారి బాధ్యతలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 7నుంచి ప్రారంభించనున్న పారిశుద్ధ్యం స్పెషల్ డ్రైవ్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు డ్రెయినేజీలు శుభ్రం చేయించాలని, తాగు నీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయించాలన్నారు. గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. తాగు నీటి కోసం వినియోగిస్తున్న బోరు మోటార్లను కొందరు సిబ్బంది 24 గంటలు వినియోగిస్తున్నారని తెలిపారు. అలాగే వీధిదీపాలను ఉదయాన్నే ఆపివేయకుండా అలాగే వదిలేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో కరెంట్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, స్పెషల్ ఆఫీసర్లు దీనిపై ప్రత్యేక దృష్టిసారించి కరెంట్ బిల్లు తగ్గించుకునేలా చూడాలన్నారు. మార్చి నెలాఖరులోపు వందశాతం పన్నులు వసూలు చేసేలా కృషి చేయాలన్నారు. ఎంపీడీవోలు టీవీఎస్‌గోపిబాబు, రాములు నాయక్, లక్ష్మణ్, లింగం, మల్లేష్, ప్రసాద్, డిచ్‌పల్లి తహసీల్దార్ రాజేందర్, ఆయా మండలాల ఎంపీవోలు, విలేజ్ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



డీపీవో జయసుధను సత్కరిస్తున్న నిజామాబాద్ డివిజన్ అధికారులు

రైస్‌మిల్లుల్లో తనిఖీలు

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని శ్రీసాయిలక్ష్మీ రైస్‌మిల్లులో సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం గత నెలాఖరు నాటి కల్లా సీఎంఆర్‌ను ముట్టజెప్పాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు తనిఖీలు చేశారు. రైస్‌మిల్లుల్లో బియ్యం నిల్వలు పరిశీలించామని, రికార్డులు స్వాధీనం చేసుకుని వివరాలను తనిఖీ చేస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మహేష్ తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,400	వెండి (కిలో)	75,100
22 క్యారెట్స్	59,400		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	45	60
బెండకాయ	60	80	పచ్చిమిర్చి	40	70
జీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	45	60	ఆలుగడ్డ	15	30
జిర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	60	80	గోబిపువ్వు	20	40
వంకాయ	25	50	బీట్‌రూట్	25	50
పాలకూర	10	20	కరివేపాకు	60	80
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	30	50
పుదీనా	40	60	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	అంబాజీపేట మ్యారేజి బ్యాండు (తెలుగు) - 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	ధీర (తెలుగు) 10.45, 7.20, గేమ్ ఆన్ (తెలుగు) 1.25, హ్యాపీ ఎండింగ్ (తెలుగు) 4.30, బూట్‌కట్ బాలరాజు (తెలుగు) 10.20
స్క్రీన్-3	హనుమాన్ (తెలుగు) - 1.30, 4.30, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	అంబాజీపేట మ్యారేజి బ్యాండు (తెలుగు) - 12.20, 6.50, ఫైటర్ (హిందీ) -3డీ- 3.15, 9.45
స్క్రీన్-2	హనుమాన్(హిందీ) -3.20, 6.40, 10.00, ఫైటర్ (హిందీ) -3డీ- 11.15
స్క్రీన్-3	అగ్లీ (ఇంగ్లిష్) - 11.00, 7.45, గేమ్ ఆన్ (తెలుగు) 2.05, అంబాజీపేట మ్యారేజి బ్యాండు (తెలుగు)-10.40
స్క్రీన్-4	కిస్మత్ (తెలుగు) 10.10, 7.15, బూట్‌కట్ బాలరాజు (తెలుగు) - 1.00 హ్యాపీ ఎండింగ్ (తెలుగు) - 4.05, ధీర (తెలుగు) - 10.05
దేవి	హనుమాన్ (తెలుగు)
నటరాజ్	కిస్మత్ (తెలుగు)
లలితామహల్	గుంటూరు కారం (తెలుగు)
విజయ్	అంబాజీపేట మ్యారేజి బ్యాండు (తెలుగు)